క్లుప్తంగా

రేపు జాబ్ మేళా

కమలాపురం: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 10వ తేదీ ఉదయం 9 గంటలకు ఈ మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని, 10కి పైగా ప్రముఖ కంపెనీలు ఈ మేళాకు హాజరవుతున్నారని ఆయన తెలిపారు. ఎస్ఎస్సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, బీటెక్ తదితర కోర్సులు పూర్తి చేసిన నిరుద్యోగులు ఈ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. నిరుద్యోగులు తప్పని సరిగా ఫార్మల్ డ్రెస్‌లో హాజరు కావాలని, రిజ్యూమ్ తప్పనిసరిగా తీసుకు రావాలని సూచించారు.

దాతల సహకారం మరువలేనిది



దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎంఈఓ తదితరులు

వేంపల్లె : దాతల సహకారం మరువలేనిదని ఎంఈఓ స్టాలిన్ ఐజాక్ పేర్కొన్నారు. బుధవారం వేంపల్లెలోని స్థానిక భవిత దివ్యాంగుల కేంద్రంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు సింగారెడ్డి నరసింహారెడ్డి, సుకన్య దంపతుల పెళ్లి రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అవసరాల గల చిన్నారులకు దుప్పట్లు, స్కూల్ బ్యాగులు, స్వీట్లు పంపిణీ చేశారు. అలాగే ఎంపీపీ పాఠశాల విద్యార్థులందరికీ స్కూల్ బ్యాగులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ స్టాలిన్ ఐజాక్ మాట్లాడుతూ పెళ్లి రోజు వేడుకలను దివ్యాంగ చిన్నారుల మధ్య నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రత్యేక అవసరాల గల చిన్నారులకు దాతలు అందిస్తున్న సహాయ సహకారాలు మరువలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఆంజనేయులు, ఉపాధ్యాయులు సులోచన, చంద్రకళావతి, భవిత కేంద్ర సిబ్బంది యశోద, సుజాత పాల్గొన్నారు.

పందెం రాయుళ్ల అరెస్టు

కొండాపురం: మండల పరిధిలోని పొట్టిపాడు గ్రామంలో జరుగుతున్న కోడిపందేలపై బుధవారం దాడులు నిర్వహించి నలుగురిని అదుపులోకి తీసుకున్నట్టు కొండాపురం ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. వీరి వద్ద నుంచి పందెం కోళ్లు, రూ. 3,850 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హెల్మెట్‌తోనే సురక్షిత ప్రయాణం



ట్రాఫిక్ సీఐ హాజీవలి

పులివెందుల రూరల్ : సురక్షితంగా గమ్యస్థానాన్ని చేరుకోవాలంటే ద్విచక్ర వాహనంపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ సీఐ హాజీవలి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని స్థానిక ట్రాఫిక్ సీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ఎక్కువగా ద్విచక్ర వాహనదారులు అతివేగంగా వెళ్లడంతోపాటు తలకు హెల్మెట్ లేక కిందపడటంతో ప్రాణాలు పోగొట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. ముఖ్యంగా పట్టణాల్లోనూ, నగరాల్లోనూ వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలన్నారు.హెల్మెట్, సీట్ బెల్టు వంటి వాటిని నిర్లక్ష్యం చేయకుండా వాహనాల్లో వెళ్తున్నప్పుడు తప్పనిసరిగా అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని సూచించారు. సెల్‌ఫోన్లలో మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు.

ఆలయ నిర్మాణానికి సహకరిస్తా

పులివెందుల టౌన్ : శ్రీరాముడి ఆలయ నిర్మాణానికి సహకరిస్తామని కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని స్థానిక భాకరాపురంలో గల జయమ్మ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీరాముడి ఆలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరాముడి ఆలయాన్ని నిర్మిస్తుండటం శుభ పరిణామమని పేర్కొన్నారు. కార్యక్రమంలో హిందూ ఐక్య వేదిక కన్వీనర్ కొప్పల శ్రీనివాస్ రెడ్డి, హిందూ ఐక్యవేదిక నాయకుడు అనిమెల్ల రామ్మోహన్, ఆలయ నిర్వాహకుడు నరసింహులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పరామర్శ



వేణుగోపాల్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె : మండల పరిధిలోని తాడిగొట్ల పంచాయతీకి చెందిన మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నాయకుడు వేణుగోపాల్‌రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి బుధవారం కృష్ణాపురంలోని వేణు ఇంటికి వెళ్లి పరామర్శించారు. మండల కన్వీనర్ ప్రభాకర్ రెడ్డి, నాయకులు శ్రీనివాసులు, కోకటం లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పరామర్శించారు.

కందిపప్పు.. ఉడికేదెన్నడో చెప్పు!

రేషన్ కార్డుదారులకు కందిపప్పు అందని ద్రాక్షగానే మిగిలింది. పేదింట పప్పు ఉడకడం లేదు. మరో వైపు మార్కెట్లో క్షణం లేని గుర్రంలా పరుగులు తీస్తున్నా అదుపు చేసే వ్యవస్థ లేకపోవడంతో కలవరపడుతున్నారు. అయినా పాలకుల్లో కాసింతైనా చలనం లేదు.

- ఏడాదిగా ఎదురుచూపులు
- బియ్యం, చక్కెర మాత్రమే అందజేత
- సరుకుల్లో కోత విధిస్తున్న 'కూటమి'



కందిపప్పు ప్యాకెట్లు (ఫైల్)

ఎర్రగుంట్ల: కూటమి ప్రభుత్వం పేదలకు అందించే నిత్యావసర సరుకుల్లో కోత విధించింది. ఏడాదిగా కందిపప్పు సరఫరా కోసం కార్డుదారులు ఎదురుచూస్తున్నారు. జగనన్న ప్రభుత్వంలో రేషన్ దుకాణాల్లో బియ్యం, కందిపప్పు, చక్కెర కూడా కార్డుదారులకు సక్రమంగా అందించేవారు. ప్రస్తుతం ప్రభుత్వం కందిపప్పు సరఫరాను నిలిపివేయడంతో పేదలు ప్రైవేట కిరాణాషాపుల్లో అధిక ధరకు కొనుగోలు చేయలేక అవస్థలు పడుతున్నారు. యర్రగుంట్ల మండలం పరిధిలోని 37 రేషన్ షాపులు ఉన్నాయి, అందులో 20,785 వేల రేషన్ కార్డుదారులు ఉన్నారు. ప్రస్తుతం నిత్యావసరాల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో కందిపప్పు రేషన్ షాపుల్లో దొరకపోవడంతో పేద మధ్యతరగతి కుటుంబాలపై అధిక భారం పడుతోంది.

నియోజకవర్గ వ్యాప్తంగా రేషన్ దుకాణాలు, కార్డులు

మండలం	రేషన్ షాపులు	రేషన్ కార్డులు
యర్రగుంట్ల	37	20,785
జమ్మలమడుగు	37	20,879
ముద్దనూరు	30	10,435
మైలవరం	31	12,728
కొండాపురం	35	11,885
పెద్దముడియం	25	9,275

కార్డుదారుల్లో నిరాశ

గత ప్రభుత్వం సరఫరా చేసిన విధంగా ప్రతి కార్డుదారుడికి కిలో కందిపప్పు అందించాలని కోరుతున్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తే కందిపప్పు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని డీలర్లు అంటున్నారు. కొందరు కార్డుదారులు బియ్యం ఒకటి ఇస్తే ఏం చేసుకోవాలి.. కుటుంబానికి సరపడా కందిపప్పు అందించాలని డీలర్ల దగ్గర కార్డుదారులు నిట్టూరుస్తున్నారు. ఏడాదిగా కందిపప్పు సరఫరా కోసం ఎదురుచూస్తున్నా రేషన్ కార్డు వినియోగదారులకు ఈ నెల కూడా నిరాశ తప్పలేదు. గత ప్రభుత్వం రేషన్ షాపుల్లో బియ్యంతో పాటు కందిపప్పు, చక్కెర కూడా ఇచ్చేవారు. కానీ ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కందిపప్పు సరఫరాను గాలికి వదిలేసింది దీంతో కార్డుదారులు తీవ్ర నిరాశ చెందుతున్నారు.

ప్రభుత్వానిదే బాధ్యత



రేషన్‌షాపుల్లో కందిపప్పు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. అధికారంలోకి వచ్చాక మొండి చేయి చూపిస్తున్నారు. కందిపప్పు రేషన్ కార్డుదారులకు అందిచడం ప్రభుత్వం బాధ్యత. పేదలకు అవసరమైన కందిపప్పును రేషన్ దూకాణాలకు అందజేసి, పేదలకు పంపిణీ చేయాలి

–మేకల వీర భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాలెపాడు

సక్రమంగా అందలేదు



ప్రభుత్వ చౌక దుకాణాలలో సరుకులు కూడా సక్రమంగా కార్డుదారులు అందలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా ఇంత వరకు కందిపప్పు సరఫరాపై దృష్టి పెట్టలేదు. గతంలో ఇంటి వద్దకే సరకులు వచ్చేయి. ఇప్పుడు మేమే డీలర్ల వద్దకు వెళ్లి తెచ్చుకోవాల్సి దుస్థితి వచ్చింది.

–ఎస్‌పీ బాషా, యర్రగుంట్ల

కందిపప్పు కోట లేదు



ఈ నెలలో కందిపప్పు కోట లేదు. అందువల్ల సరఫరా లేదు. బియ్యం మాత్రం అందించాం . కందిపప్పు ప్రభుత్వం సరఫరా చేస్తే కార్డుదారులకు పంపిణీ చేయడానికి డీలర్లు సిద్ధంగా ఉన్నారు. ప్రస్తుతం బియ్యం, చక్కెర మాత్రం కార్డుదారులకు పంపిణీ చేస్తున్నాం

– శోభన్‌బాబు, తాహసీల్దార్, యర్రగుంట్ల మండలం

సీజేఐపై దాడి యత్నం హేయమైన చర్య



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

జమ్మలమడుగు: సుప్రీం కోర్టులో సీజేఐ భూషణ్ రామకృష్ణ గవాయ్‌పై ఓ మతోన్మాది షూ విసిరే ప్రయత్నం చేయడం హేయమైన చర్య అని పలు ప్రజాసంఘాల నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. ఇలాంటి చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. బుధవారం స్థానిక పాత బస్టాండ్‌లో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో సీజేఐపై దాడిని ఖండిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగం, న్యాయ వ్యవస్థపైనే దాడిగా పరిగణించి, బాధ్యుడైన న్యాయవాదిని తక్షణం ఆవృత్తి నుంచి తొలగించాలని, కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మనువాదుల దాడులను ఖండించకపోతే భవిష్యత్తులో మరిన్ని దాడులు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం అంటూ నినదించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది భూతమాపురం సుబ్బారావు, మానవహక్కుల మహిళ అధ్యక్షురాలు అన్నపురెడ్డి రాణి, శివమోహన్, శివకుమార్, శివనారాయణ పాల్గొన్నారు.

పోటాపోటీగా స్కూలు ఫెడరేషన్ గేమ్స్



లింగాల: విద్యార్థులను పరిచయం చేసుకుంటున్న ఎంఈఓ విశ్వనాథరెడ్డి



చింతకొమ్మదిన్నె : విద్యార్థులకు సూచనలిస్తున్న ఉపాధ్యాయులు

లింగాల : లింగాల మండలం పార్నపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో బుధవారం స్కూలు ఫెడరేషన్ గేమ్స్ పోటా పోటీగా జరిగాయి. అండర్–17, అండర్–14 విద్యార్థినీ విద్యార్థుల వాలీబాల్, కబడ్డీ పోటీలను నిర్వహించారు.

వాలీబాల్, కబడ్డీ విజేతలు

అండర్–14 వాలీబాల్ బాలుర, బాలికల జట్లు విన్నర్స్‌గా పార్నపల్లె హైస్కూలు విద్యార్థులు, అండర్–14 వాలీబాల్ లింగాల బాలుర జట్టు రన్నర్స్‌గానూ, అండర్–14 వాలీబాల్ వెలిదండ్ల బాలికల జట్టు రన్నర్స్‌గానూ, అండర్–14 కబడ్డీ పార్నపల్లె బాలుర, బాలికల జట్లు విన్నర్స్‌గానూ, అండర్–14 కబడ్డీ పెద్దకుడాల బాలుర జట్టు రన్నర్స్‌గా, అండర్–14 కబడ్డీ వెలిదండ్ల బాలికల జట్టు రన్నర్స్‌గా నిలిచారు.

అండర్–17 వాలీబాల్ విజేతలు

అండర్–17 వాలీబాల్ బాలుర, బాలికల జట్లు పార్నపల్లె హైస్కూలు విద్యార్థులు విన్నర్స్‌గానూ.. వాలీబాల్ పోటీలలో అండర్–17 వెలిదండ్ల బాలుర విద్యార్థులు రన్నర్స్‌గా, వెలిదండ్ల జెడ్పీ బాలికల జట్టు రన్నర్స్‌గా నిలిచారు. అండర్–17 కబడ్డీ లింగాల బాలుర జట్టు విన్నర్స్‌గానూ, వెలిదండ్ల హైస్కూలు బాలురు జట్టు రన్నర్స్‌గా నిలిచారు. కార్యక్రమంలో ఎంఈఓలు విశ్వనాథరెడ్డి, రామకృష్ణయ్య, పాఠశాల హెడ్మాస్టర్ అర్జున్‌రెడ్డి, అన్ని పాఠశాలల పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేంపల్లె : చదువులో రాణిస్తూ క్రీడల్లో మంచి విజయాలను సొంతం చేసుకోవాలని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.ఎఫ్.బాషా పేర్కొన్నారు. బుధవారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో స్కూల్ ఆఫ్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో తమ విద్యార్థులు అత్యంత ఉత్తమ ప్రతిభ కనబరిచారని హర్షం వ్యక్తం చేశారు.

ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు

చింతకొమ్మదిన్నె : ప్రస్తుత 2025–26 సంవత్సరానికి సంబంధించి ఎస్‌జీఎఫ్ క్రీడా మండల స్థాయి పోటీలను చింతకొమ్మదిన్నె మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించారు. కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగ పోటీలను మండల విద్యాశాఖ అధికారి సుబ్బరాయుడు ఆధ్వర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శోభారాణి అధ్యక్షతన ప్రారంభించారు. సీనియర్స్ విభాగంలో కబడ్డీలో విన్నర్‌గా చింతకొమ్మదిన్నె జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు, రన్నర్‌గా జె.కొత్తపల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు నిలిచారు. వాలీబాల్ పోటీలలో విన్నర్‌గా జె.కొత్తపల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు, రన్నర్స్‌గా చింతకొమ్మదిన్నె జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు నిలిచారు. జూనియర్స్ విభాగంలో వాలీబాల్ సంబంధించి జె.కొత్తపల్లి విద్యార్థులు విన్నర్‌గాను, అంగడి వీధి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు రన్నర్‌గా నిలిచారు, కబడ్డీ విభాగంలో జె. కొత్తపల్లి విద్యార్థులు విన్నర్స్‌గాను, చింతకొమ్మదిన్నె జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు. ఆటల పోటీలకు మండల కోఆర్డినేటర్ గా వ్యాయామ ఉపాధ్యాయుడు వేల్పుల నాగార్జునయ్య వ్యవహరించారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



కమలాపురం: కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు




వల్లూరు: అండర్ -17 కబడ్డీ బాలుర జట్టు

కమలాపురం: క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఇష్టమైన క్రీడలను ఎంచుకుని వాటిలో రాణించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ తులశమ్మ అన్నారు. బుధవారం స్థానిక గురుకుల పాఠశాలలో ఎస్‌జీఎఫ్ మండల కోఆర్డినేటర్ సుబ్బన్న, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సునీల్ పర్యవేక్షణలో జరిగిన మండల స్థాయి అండర్–14, అండర్–17 విభాగాల క్రీడా ఎంపికలను ఆమె ప్రారంభించారు. మొదటి రోజు కబడ్డీ, బ్యాడ్మింటన్, చెస్, యోగా పోటీల్లో ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలతోనే దేశానికి పేరు ప్రతిష్టలు లభిస్తాయన్నారు. విద్యార్థులు క్రీడలు ఆడినపుడే మెదుడు చురుగ్గా పని చేస్తుందని, తద్వారా చదువులో కూడా రాణించవచ్చన్నారు. అలాగే క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం, మానసిక ప్రశాంతత పొందవచ్చని పేర్కొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచి ఎంపికైన వారిని డివిజన్ స్థాయి పోటీలకు పంపిస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన పీఈటీలు, పీడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలి

వల్లూరు: విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని గంగాయపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రఘునాథరెడ్డి అన్నారు. గంగాయపల్లెలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి కబడ్డీ జట్ల ఎంపికలో భాగంగా బుదవారం విద్యార్థులకు కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఇందులో భాగంగా అండర్ -14, అండర్ - 17 కేటగిరీలో బాలుర, బాలికల విభాగాల్లో వేరు వేరుగా నిర్వహించిన ఈ పోటీలకు మండల పరిధిలోని వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. హెచ్ఎమ్ మాట్లాడుతూ విద్యార్థుల్లోని క్రీడా నైపుణ్యాలను వెలికి తీయడానికి ఇలాంటి పోటీలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన వారిని మండల స్థాయి జట్టుకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో పీడీలు అజాస్ అహమ్మద్, సుశీలమ్మ, మధుసూదన్ రెడ్డి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి వైఫల్యాలను ప్రజలకు చెబుదాం



శివకుమార్‌ను సన్మానిస్తున్న జెడ్పీటీసీ బాలయ్య, నాయకులు

ఎర్రగుంట్ల : ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో తీసుకెళ్తామని యర్రగుంట్ల జెడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్య అన్నారు. బుధవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మాడిశెట్టి శివకుమార్‌ను జెడ్పీటీసీ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను వేధించడం, అక్రమ కేసులు బనాయించడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. ప్రజల పక్షాన నిరంతరం పోరాటాలు కొనసాగిస్తూనే ఉంటామని తేల్చిచెప్పారు. రెడ్ బుక్‌కు దీటుగా డిజిటల్ బుక్ పని చేస్తుందన్నారు. డిజిటల్ బుక్ ద్వారా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యకర్తలకు అండగా ఉంటారని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు, దాడులు జరిగితే వాటి ఫొటోలు, దాడి జరిగిన సంఘటనలు డిజిటల్ బుక్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. యర్రగుంట్ల పట్టణ అధ్యక్షులు జయరామక్రిష్టారెడ్డి, కౌన్సిలర్ మహమ్మద్ అలీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రశాంత్ పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ



మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ జావీద్

చింతకొమ్మదిన్నె : అప్రమత్తతతోనే ప్రమాదాలను నివారించవచ్చని కడప ట్రాఫిక్ సీఐ జావీద్ అన్నారు. అంగడి వీధిలోని అమరావతి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై బుధవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ మాట్లాడుతూ రహదారిని దాటేటప్పుడు పాటించవలసిన నియమాలు, రోడ్లపై వ్యవహరించవలసిన తీరును, రహదారిలో ప్రయాణించేటప్పుడు పాటించవలసిన నియమాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన కలిగి ఉండాలి



సదస్సులో ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు

పులివెందుల టౌన్ : జీఎస్టీపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జీఎస్టీ విభాగం డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జీఎస్టీ ప్రాముఖ్యత గురించి వివరించారు. వినియోగదారులకు కలిగే లాభాలు, పన్నుల చెల్లింపులో పౌరుల బాధ్యతలపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ శ్రీనివాసులు గత పన్నుల విధానానికి ప్రస్తుత పన్నుల విధానానికి వచ్చిన మార్పులను వివరించారు. అనంతరం విద్యార్థులకు ఉపన్యాస పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో జీఎస్టీ అధికారులు పుష్పలీల, స్వరాజ్యలక్ష్మి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బాలనారాయణ, రమీజ, విద్యార్థినులు అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి



సమస్యలను తెలుసుకుంటున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తదితరులు

పులివెందుల : పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని పులివెందుల మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పులివెందుల పట్టణంలోని పలు వార్డుల్లో సమస్యలను అధికారులతో కలిసి వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు హాలు గంగాధరరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ఎస్టీ కాలనీ, రాజీవ్‌గాంధీ కాలనీ సమీపంలో వాటర్ ట్యాంకు, జయమ్మ కాలనీలో భూగర్భ డ్రైనేజీ సమస్యలను అధికారులతో కలిసి పరిశీలించి వెంటనే మరమ్మతులు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా వైఎస్ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ అధికారులు, వార్డు ప్రజా ప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో మోట రాజశేఖర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణురాలు రాక

- అందుబాటులో ప్లాస్టిక్ సర్జరీ సేవలు

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్ (గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ చర్మవ్యాధుల వైద్య నిపుణురాలు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ చర్మవ్యాధుల వైద్య నిపుణరాలు డాక్టర్ శుక్రవారం ఉదయం 11.45 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటలవరకు సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పక్కులు సలిపిరి, తల్లి (అమ్మవారు), సబ్బం (శోభి), మాగురు (మంగు), అలర్జీ, ఆనెలు, కాళ్లు పగులుట, పులిపిర్లు, పేను కొరుకుట, జుట్టు రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ మచ్చలు, కుష్టు, తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. అలాగే చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ ఉదయం 9.45 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దం, చెవిలో కర్ణభేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ప్రముఖ ప్లాస్టిక్ సర్జరీ వైద్య నిపుణురాలు డాక్టర్ దీప్తి బత్తు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు కాస్మెటిక్ సర్జరి, హ్యాండ్ సర్జరి, మైక్రో వ్యాక్యులర్ సర్జరి, ట్రామా రీకంస్ట్రక్షన్, బర్న్ సర్జరి, డయాబెటిక్ ఫూట్ సర్జరి, క్రానియో ఫేషియల్ సర్జరి, అన్యో రీకంస్ట్రటివ్ సర్జరి సేవలు అందిస్తారన్నారు. కిడ్నీ వైద్య నిపుణులు డాక్టర్ వరలక్ష్మి ఈనెల 11వ తేదీ శనివారం సాయంత్రం 6గంటల నుంచి రాత్రి 8గంటల వరకు ఓపీలో అందుబాటులో ఉంటారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9963170177, 08568286189 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని కోరారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



వధూవరులతో మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి: మండలంలోని ఎం.యారాసుపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు చిన్న మల్లేశ్వరరెడ్డి కుమారుడు అమర్‌నాథరెడ్డి, ఇందు వివాహం బుధవారం యారాసుపల్లె గ్రామంలో జరిగింది. ఈ వివాహ వేడకకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి హాజరై వధువరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎంపీపీ వరలక్ష్మి, ఎంపీటీసీ నాగమల్లారెడ్డి, కడప నగర ఈస్ట్ జోన్ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతులు!

- రోడ్డుకు మోక్షమెప్పుడో?
- ఇరుకు రోడ్డుతో వాహనదారుల అవస్థలు



ప్రమాదకరంగా పులివెందుల - ముదిగుబ్బ రోడ్డు

పులివెందుల టౌన్: పులివెందుల – ముదిగుబ్బకు వెళ్లే రహదారిలో పాత ఆర్టీసీ సర్కిల్ నుంచి వైఎస్సార్ రింగ్ రోడ్డు సర్కిల్ వరకు ఇరుకు రోడ్డుతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఫోర్ లైన్ రోడ్డులో భాగంగా డబుల్ రోడ్డుగా ఉన్న రోడ్డును ఒకవైపు వెడల్పు చేశారు. మరోవైపు ఉన్న రోడ్డు సింగిల్‌గా ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతలోనే ఎన్నికలు రావడంతో ఫోర్‌లైన్ రోడ్డు పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం మరోవైపు సింగిల్ రోడ్డుగా ఉన్న దారి వాహనదారులకు పెద్ద సవాల్‌గా మారింది. ఎదురుగా వస్తున్న వాహనాన్ని మళ్లించేందుకు వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడాల్సి వస్తోంది. ఆదమరిచి వాహనాన్ని క్రాస్ చేయాలని చూస్తే ప్రమాదాలు తప్పడం లేదు. మూడు రోజుల క్రితం ఆటో అదుపుతప్పి కింద పడింది. ఇందులో మహిళలు, పిల్లలు ఉన్నారు. అయితే ఈ ప్రమాదంలో స్వల్ప గాయాలతో బయట పడ్డారు. ఎంతో మంది వాహనదారులు ప్రమాదాలకు గురైన దాఖలాలు ఉన్నాయి.

అంతేకాకుండా ఆ దారిపొడవునా 8 చోట్ల అడ్డ రోడ్డులు ఉండటంతో ఆ దారిలో నుంచి వచ్చే వాహనాలు ఉన్నఫలంగా రావడంతో వాహనాలు ఢీకొంటున్న సంఘటనలు కూడా చోటు చేసుకుంటున్నాయి. దీంతో వాహనదారులు ఎక్కడ ప్రమాదాలు జరుగుతాయోనని వారు ఆందోళన చెందుతున్నారు. ఆద మరిచి వాహనాలు నడిపితే ప్రమాదాలకు గురి కావాల్సిందేనని వాహనదారులు జంకుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇరుకుగా ఉన్న రోడ్డును సరి చేసి రాకపోకలను యథావిధిగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

అవస్థలు పడుతున్నాం

వైఎస్సార్ సర్కిల్ రింగ్ రోడ్డు నుంచి పులివెందుల పట్టణంలోకి వచ్చే దారి ఇరుకుగా ఉండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఎదురుగా వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని క్రాస్ చేయాలన్న ఇబ్బందిగా మారుతోంది. అధికారులు స్పందించి రోడ్డును సరిచేస్తే ప్రమాదాలను అరికట్టవచ్చు.

– సురేంద్ర, స్థానికుడు, పులివెందుల

జంకుతున్నాం

రోడ్డు ఇరుకుగా ఉండటంతో ఎక్కడ ప్రమాదాలు జరుగుతాయోనని జంకుతున్నాం. సింగిల్ రోడ్డు కావడంతో వాహనాలను నెమ్మదిగా నడపాల్సి వస్తోంది. ఎవరైనా స్పీడ్‌గా వస్తే అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని వాహనాన్ని నడపాల్సి వస్తోంది. ఈ రోడ్డుకు మరమత్తులు చేయిస్తే బాగుంటుంది.

– కిశోర్, స్థానికుడు పులివెందుల